# మనుషుల మధ్య దూరం

ప్రొఫెసర్ బలదేవ కోపంగా వున్నాడు. ఆయనకు ఎందుకో అనుమానంగా వుంది. ఆయన అనుమానం అంతా ఆయన ఒక్కగానొక్క కూతురు రంజిత గురించే. ఈ విషయంలో ఆయన భార్య వందన ఏదో దాస్తున్నదని ప్రొఫెసర్ బలదేవ సందేహపడుతున్నాడు.

రాత్రి ఎనిమిది గంటలు కావస్తోంది. బయటకు వెళ్ళిన రంజిత ఇంతవరకు తిరిగి ఇంటికి రాలేదు. ఎమ్మెస్సీ చదువుతూ పెళ్ళీడుకు వచ్చిన కూతురు ఈ సమయం వరకూ ఇంటికి రాకపోవడం ఆయన అనుమానాన్ని మరింత పెంచుతుంది. అసలు రంజిత ఇంట్లోనించి ఎప్పుడు బయటకు వెళ్ళిందో ఆయనకు తెలీదు. బలదేవ సాయంత్రం నాలుగు గంటలు కావస్తున్నప్పుడు తన గదిలోంచి బయటకు వచ్చాడు. అప్పటికే రంజిత ఇంట్లో లేదు. ఎప్పుడు వెళ్ళిందో మరి. తల్లికయినా చెప్పి వెళ్ళిందో? లేదో?

కూతురి గురించి భార్యనడిగాడు.

"ఎవరో ఫ్రెండుని కలవాలని వెళ్ళింది" చెప్పిందామె

"ఎవరా ఫ్రెండు?"

"ఏమో తెలీదు. నేనడగలేదు" ముక్తసరిగా అన్నది వందన.

"ఇంతకీ నువ్వు నిజమే చెబుతున్నావా?" అతడి కళ్ళల్లో అనుమానాన్ని ఆమె పసిగట్టింది.

"నాకు తెలిసింది చెప్పాను"

"కూతుళ్ళకు తల్లి సపోర్టు వుంటుందని నాకు తెలుసు. నువ్వు నిజం చెబుతావనే నమ్మకం నాకు లేదు. అయినా అడిగాను" బలదేవ అన్నాడు నవ్వటానికి ప్రయత్నం చేస్తూ.

"ఇంతగా మీరెందుకు అడుగుతున్నారో నాకు అర్థం కావటం లేదు. ఇంతకీ మీ మనసులో ఏముంది?" వందనడిగింది.

"రంజిత ప్రవర్తనలో ఈమధ్య మార్పు కనపడుతోంది. అలంకరణపట్ల శ్రద్ధ పెరిగింది. బాడీ ఫిజిక్ గురించి జాగ్రత్త పడుతోంది. ఇంతకుముందులా తిండి తినటంలేదు. కాలేజీనుంచి రోజూ ఆలస్యంగా వస్తోంది. హాలిడేస్‌లో కూడా స్నేహితుల పేర్లు చెప్పి బయటకు వెళుతోంది. ముఖ్యంగా మొహంలో సంతోషం

కనబడుతోంది. పెళ్ళి వయసులో ఉన్న ఆడపిల్ల ఇలా ప్రవర్తిస్తున్నదంటే దీనర్థం ఏమిటో నీకు తెలుసా?" అనడిగాడు బలదేవ.

వందన తెలీదన్నది.

"నీకు తెలిసే వుండాలి. నువ్వు కూడా ఆ వయసునించే వచ్చావు".

"కావచ్చు. ఐనా నాకు తెలీదు. నేనెప్పుడూ ఇలా ప్రవర్తించలేదు" అన్నది.

భార్య మనసులో ఏమున్నదో ఆయన కనిపెట్టలేకపోతున్నాడు. నిజంగానే తెలీదా? లేకపోతే నటిస్తున్నాదా?

"సరే.... నేనే చెబుతాను. రంజిత మనసు వశం తప్పి వుండాలి. ప్రేమలో పడి వుంటుంది".

ఎందుకో వందన మొహం కళ తప్పింది. బలదేవవైపు కొంచెం భయంగా చూసింది. ఇంటి విషయాలు ఏమీ పట్టించుకోనట్టు కనబడే ఈ మనిషి రంజితను ఇంతగా గమనిస్తున్నాడా? భార్య మౌనాన్ని అర్థం చేసుకున్నట్టు "ఈ విషయం నీకెప్పుడో తెలుసుకదా?" అన్నాడు బలదేవ.

ఉలిక్కిపడింది వందన. చివుక్కున తలతిప్పి ఆయన్ని చూసి "నన్ను హింసించదల్చుకున్నారా?" అనడిగింది కొంచెం రోషంగా.....

"ఎక్కువగా రియాక్టు అవకు వందనా.... నేను మనుషుల్ని పుస్తకంలా చదువగలను" అన్నాడు నవ్వదల్చుకున్నాడో? లేదో? అర్థం కానట్టు మొహాన్ని వుంచి.....

"ఇదంతా ఎందుకు? వస్తుందిగా.... దాన్నే అడగండి?" అన్నది అక్కడినించి వెళ్ళే ప్రయత్నం చేస్తూ.

ఇంతలోనే డోర్ నెట్టుకుని రంజిత లోపలకు వచ్చింది. కూతుర్ని చూడగానే గోడనున్న గడియారాన్ని చూశాడు ప్రొఫెసర్ బలదేవ. ఎనిమిదిన్నరవుతోంది.

వస్తూనే కోపంగా వున్న తండ్రి మొహాన్ని పాలిపోయినట్టున్న తల్లి మొహాన్ని చూసి వాళ్ళిద్దరి మధ్యనా ఏదో విషయం తీవ్రంగా నలుగుతోందని అనుకున్నది.

"ఆకలవుతోందమ్మా" తల్లి దగ్గరకు వచ్చి అన్నది రంజిత.

"నీకు ఆకలి కూడా అవుతోందా?" కొంచెం హేళనగా అన్నాడు బలదేవ.

"అదేమిటి నాన్నగారూ.... ఇలా అంటారు?"

"మరెలా అనాలి? రాత్రి ఎనిమిదన్నర వరకూ ఎక్కడ తిరిగి వస్తున్నావ్?"

అనడిగాడు బలదేవ.

"ఒక ఫ్రెండింటికి వెళ్ళి వస్తున్నాను"

"ఆడా? మగా?" స్పష్టమైన హేళన ఆయన మాటల్లో....

"ఏమిటి నాన్నగారూ? కొత్తగా మాట్లాడుతున్నారు?" కొంచెం ఆశ్చర్యంగానే అడిగింది.

"ప్రవర్తనలో కొత్తదనం కనబడినప్పుడు మాటలు కూడా కొత్తవిగానే వుంటాయి తప్పదు" అన్నాడు భార్యను చూస్తూ. ఆమె వాళ్ళ సంభాషణలో ఆసక్తి లేనట్టు ఎటో చూస్తోంది.

బలదేవ భార్యని గమనిస్తూనే వున్నాడు. తల్లీ కూతుళ్ళిద్దరూ కలిసి నాటకమాడుతున్నారని ఆయనలో వున్న అనుమానం నిమిష నిమిషానికీ బలపడుతోంది.

"మాట్లాడవేం?"

"మీరు మనసులో ఏదో పెట్టుకుని మాట్లాడుతున్నారు" అన్నది రంజిత.

"అవును. తండ్రిలా పెళ్ళీడు కొచ్చిన కూతురి ప్రవర్తన గురించి నా సందేహాలు నాకుంటాయి. నా సందేహాలకు జవాబు కావాలి.... చెప్పు.... నువ్వు నీ మగ ఫ్రెండును కలిసి వస్తున్నావు కదూ?".

అవునన్నది రంజిత ఒక నిర్ణయానికి వచ్చినట్టు.

"నీకెంత ధైర్యం?" అన్నాడాయన వెంటనే.

తల్లి కూతురివేపు ఆశ్చర్యంతో చూసింది. తండ్రి ఎదుట ఒప్పుకుంటుందని వూహించలేదు.

"ఎవడు వాడు?" అన్నాడు బలదేవ.

"నాన్నగారూ.... సవ్యంగా మాట్లాడండి. మీ ప్రవర్తనను సరిదిద్దే అవకాశం నాకు కల్పించండి" చాలా శాంతంగా అన్నది రంజిత.

"సారీ.... ఎవరతను?"

"ఏర్‌ఫోర్స్‌లో జూనియర్ ఆఫీసర్. పేరు రాజేష్. అందంగా వుంటాడు. నాకు నచ్చాడు".

"ఈ విషయంలో తల్లిదండ్రులుగా మా ప్రమేయమేమీ లేదా?"

"మీకో పని, మీకో కొంత శ్రమ తప్పించానని అనుకోండి".

"ఈ ఇంటికి అల్లుడయ్యే మనిషి గురించి మాకు కొన్ని కోరికలుంటాయని నీకు తెలీదా?" ప్రశ్నించాడు.

తల్లి కేవలం శ్రోత అయింది. భర్తనీ, కూతుర్నీ మార్చి మార్చి చూడటం తప్పించి ఆమెకు మరో పని లేకపోయింది.

"తెలుసు. కానీ ఇది నా జీవితం. నా జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలకు పూర్తిగా నేనే బాధ్యత వహించాలి. వాటిని నేనే అనుభవించాలి. ఇంకొకరి కోరికలు తీర్చటానికి నా ఇష్టాలను చంపుకోవటం నాకిష్టం లేదు. మీ గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లకుండా నా జీవితాన్ని నేను మల్చుకుంటున్నాను. నా దృష్టిలో ఇది తప్పు కాదనుకుంటాను" తన మనసులో వున్నదంతా చెప్పింది రంజిత.

"అయితే అతన్ని పెళ్ళి చేసుకోగలననే అనుకుంటున్నావా?" సీరియస్‌గా అడిగాడు ప్రొఫెసర్ బలదేవ.

రంజిత నిర్లక్ష్యంగా నవ్వింది. ఏదో ఒకరోజు తనింట్లో ఇటువంటి సంభాషణ జరుగుతుందని అనుకుంటూనే వుంది. తనెలా మాట్లాడవలసిందీ ముందుగానే నిర్ణయించుకున్నదానిలా మాట్లాడుతోంది. ఎక్కడా తడబాటు కాకుండా.

"ఏమిటా నవ్వు?" కోపంగా అడిగాడు. ఆయనకు నిమిష నిమిషానికీ కోపం పెరిగిపోతుంది. తన పెంపకంలో పెరిగిన కూతురు ఇలా ప్రవర్తిస్తుందని కొంచెం కూడా వూహించలేదు. ఆడపిల్లలకు వయసుతో పాటు ఆలోచనలు కూడా పెరుగుతాయనే ఆలోచన ఆయనకు ఎప్పుడూ రాలేదు. అందుకే ఇంత ఆశ్చర్యం.

"నా మాటల సారం అతన్ని పెళ్ళి చేసుకుంటాననే కదా?"

"నేనొప్పుకోను రంజితా"

"మిమ్మల్ని వొప్పుకోమని నేనడగలేదు. మీరు వొప్పుకుంటారని కూడా నేనుకోలేదు. చెప్పాను కదా ఇది నా జీవితం అని. మీ ఇష్టాలను నామీద రుద్దాలని అనుకోకండి నాన్నగారూ".

"నువ్వయినా చెప్పు" అన్నాడు బలదేవ భార్యని....

"మీ మాట విననపుడు నా మాట వింటుందా? ఐనా ఎమ్మెస్సీ చదువుతున్న ఆడపిల్లకు మంచీ, చెడుల విచక్షణ తెలీకుండా వుంటుందా? అది అతన్ని ప్రేమిస్తేనేం? ప్రేమించకపోతేనేం? ఎయిర్‌ఫోర్స్‌లో ఒక జూనియర్ ఆఫీసర్‌ని

పెళ్ళి చేసుకోవాలని అనుకుంటోంది. ఇది తప్పని నాకు అనిపించడం లేదు. అతన్ని చేసుకుంటే అది సుఖపడదంటారా?"

బలదేవ భార్యకేసి రౌద్రంగా చూశాడు. అనవసరంగా భార్యని కదిలించానని అనుకున్నాడు.

"ఇంకొకర్ని చేసుకున్నా సుఖపడుతుంది. నాకు తెలిసి ఒక జూనియర్ సైంటిస్టు వున్నాడు. నా స్నేహితుడి కొడుకు. లక్షణంగా వుంటాడు. రంజితను పెళ్ళాడలనే కోరిక వున్నట్టు కొన్నిసార్లు నా దగ్గర బయటపెట్టాడు. అతడిని అల్లుడిని చేసుకోవాలనుకున్నాను. కానీ నువ్వు కాదంటున్నావు. అందుకు నాకు బాధగా ఉ ంది".

కొంచెంసేపు ఎవరూ మాట్లాడలేదు. అక్కడ మౌనం రాజ్యమేలింది కొంతసేపు.

ఆ మౌనానికి కత్తెర వేస్తూ "ఇంతకీ మీరేమంటారు?" అన్నది రంజిత.

"నువ్వు చెప్పినట్టుగా అతన్నే పెళ్ళి చేసుకునేట్టయితే నీకూ మాకు మధ్య వున్న సంబంధం తెగిపోతుంది. ఇక నువ్వు ఈ ఇంటివైపు రావలసిన అవసరం వుండదు. మనం శాశ్వతంగా విడిపోతాం. నా ఇష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించే వాళ్ళని నేను క్షమించను. కానీ అమ్మ నాలాగా బయటపడి చెప్పకపోవచ్చును. కానీ నన్ను అనుసరించక తప్పదు. నా మాట కాదని, నన్నెదిరించి మీ అమ్మ ఏమీ చెయ్యలేదని నీకు తెలుసు కదా" ముందే ప్రిపేరయినట్టుగా చెప్పాడు బలదేవ.

"నాన్నగారూ.... అయితే నా మాట కూడా వినండి. నేను తప్పు చెయ్యటం లేదని నాకు తెలుసు. మేమిద్దరం సరదాగా ప్రేమించుకోలేదు. పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. నా వాగ్దానానికి నేను కట్టుబడి వుంటాను. అతన్నే పెళ్ళి చేసుకుంటాను. నిజానికి ఒకరికోసం ఇంకొకరిని వదులుకోవలసిన అవసరం లేదు. కానీ ఈ అనవసరమయిన అవసరాన్ని మీరు కల్పించుకుంటున్నారు. మీ ఇష్టప్రకారమే కానివ్వండి నాన్నగారూ" అన్నది రంజిత.

తల్లికి ఏడుపు తన్నుకు వచ్చింది. ఎంత ప్రయత్నం చేసినా దుఃఖం ఆగలేదు. ఏమిటీ మనిషి? అంతరించిపోతున్న వన్యప్రాణుల గురించి ఆదుర్దాపడే ఈ మనిషిలో ఇంతటి మూర్ఖత్వం వుందా? కన్న కూతుర్ని వదులుకోవటానికి సిద్ధమయ్యాడా? చీర చెంగుతో కళ్ళు అద్దుకుంది.

రంజిత అ గదిలోనుంచి వెళ్ళిపోయింది. ఆ మర్నాడు పూర్తిగా ఆ ఇంట్లోనుంచి వెళ్ళిపోయింది తల్లి ఏడ్చినా వినకుండా.

అలా వెళ్ళిపోయిన నెలరోజులకు తను ప్రేమించిన జూనియర్ ఆఫీసర్‌ని పెళ్ళి చేసుకుని ఆ విషయాన్ని ఫోన్ చేసి తల్లితో చెప్పింది రంజిత. ఒక్కగానొక్క కూతురి పెళ్ళిని చూడలేకపోయినందుకు కుమిలిపోయింది ఆ తల్లి.

ప్రొఫెసర్ బలదేవ మాత్రం ఎప్పటిలాగానే వన్యప్రాణుల గురించీ, పర్యావరణం గురించీ రకరకాల మేగజైన్లలో ఆర్టికల్స్ రాస్తూ కాలం గడుపుతున్నాడు.

రంజిత పెళ్లయిన నాలుగు నెలలకు ప్రొఫెసర్ బలదేవ రాసిన ఆర్టికల్ ఒక జర్నల్‌లో ప్రచురితమయ్యింది.

ప్రపంచవ్యాప్తంగా పులుల సంఖ్య తగ్గిపోతుందనీ, ఇలా జరిగితే ఇంకొన్నాళ్ళకు పులుల జాతి అంతరించిపోతుందనీ, ఆ జాతిని కాపాడవలసిన బాధ్యత మనుషుల మీద వుందనీ ఆందోళన వ్యక్తంచేస్తూ రాశాడు.

దానికి గొప్ప స్పందన వచ్చింది. ఎంతోమంది బలదేవను అభినందించారు.

ఇటువంటి సమయంలోనే ప్రొఫెసర్ బలదేవకు పోస్టులో ఒక ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరాన్ని ఆయన కూతురు రంజిత రాసింది. చదవకూడదనుకుంటూనే సహజమయిన కుతూహలంకొద్దీ చదవడం మొదలుపెట్టాడు.

నాన్నగారికి,

పులుల జాతి అంతరించిపోతుందేమోనని ఆందోళన వ్యక్తంచేస్తూ మీరు రాసిన ఆర్టికల్‌ని చదివాను. చాలా బాగా రాశారు. దాన్ని చదివాక నాకు చెప్పుకోలేనంత నవ్వొచ్చింది. నా భర్త రాజేష్‌చేత కూడా దాన్ని చదివించాను. ఇతను కూడా ఇంకా ఎక్కువగా నవ్వాడు. మేమే కాదు, మీ మూర్ఖత్వం, మొండితనం గురించి తెలిసిన వాళ్ళెవరయినా ఇలాగే నవ్వుతారు.

వన్యప్రాణుల అంతరింపు గురించి ఆలోచించి ఆదుర్దా పడుతున్న మీరు మానవ సంబంధాలు విచ్ఛిన్నమవుతున్నాయనీ, మనుషుల మధ్య దూరం పెరుగుతుందనీ ఎందుకు ఆలోచించలేకపోతున్నారో అర్థం కావడంలేదు.

మీ స్వంత అన్నదమ్ముల మధ్య, అక్కా చెల్లెల మధ్య సయోధ్య లేదు. వాళ్లెవరన్నా మీకు పడదు. వాళ్ళెవరూ మనింటికి రారు. కనీసం ఫోన్ చేసి కూడా మాట్లాడరు. మన బంధువులందరినీ దూరంగా వుంచారు. చివరకు అమ్మ తమ్ముళ్ళూ, అన్నలూ, చెల్లెల్లూ మనింటికి రాకుండా చేశారు.

మీ పంతం నెగ్గించుకోవటానికి మీ కన్నకూతుర్ని నన్నే వదులుకున్నారు. ఇంక మీరు అటువంటి వ్యాసాన్ని రాయడంలో అర్థం ఏమిటి? ఎవరికోసం రాశారు?

దానివల్ల ప్రయోజనం ఏమిటి?

ఇప్పటికే ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అయినాయి. మనుషుల్లో అసూయా, ద్వేషం, స్వార్థం పెరిగిపోయి ఒకరినొకరు దూరం అవుతున్నారు. మనుషులకు బంధువులూ, స్నేహితులూ కూడా దూరమవుతున్నారు.

నా జీవితంలో ఎటువంటి లోలూ లేదు. నా భర్త నన్ను ప్రేమగా చూసుకుంటున్నాడు. నా అత్త మామలు నన్ను తన కన్న కూతురిగా భావిస్తున్నారు. కానీ మీకు దూరమయ్యానన్న బాధ అనుక్షణం నన్ను వేధిస్తోంది. చిన్న తప్పుకు పెద్ద శిక్ష వేశారు.

మానవుడు సంఘజీవి అని ఎప్పుడో చిన్నప్పుడు క్లాసు పుస్తకంలో చదివిన మాట గుర్తుకు వస్తోంది. మనుషులు మనుషుల మధ్య తిరుగుతున్నా వాళ్ళ మనసుల్లో ఒంటరితమనమే ఫీలింగ్ బాధిస్తూనే వుంటుంది.

కేవలం పంతాలు నెగ్గించుకోటానికీ, అవసరాలు తీర్చుకోవటానికేనా మనుషుల అవసరం, అంతకుమించి ఇంకేమీ లేదా? ఇంకేమీ అవసరం కాదా? అలాంటప్పుడు ప్రేమ, ఆప్యాయతా, మమతా, అనురాగం అనే పదాలకు అర్థం ఏమిటి నాన్నగారూ?

ఇవాళ సాటి మనిషి చస్తున్నా పట్టించుకోవటం లేదంటున్నారు. చావు ఒక్కటే విషాదకరమైన సంఘటన కాదు. దాన్ని మించినవి ఎన్నో వున్నాయి. ఇవాళ నేను తల్లిదండ్రుల ప్రేమకోసం అలమటిస్తున్నాను. ఇది విషాదకరమైన విషయం కాదా? ఆలోచించండి నాన్నగారూ.... ఇలా రాస్తున్నందుకు నన్ను క్షమించండి. మిమ్మల్ని బాధపెట్టాలని కాదు. జన్మనిచ్చిన తండ్రి ఎదుట నా మనసును బయటపెడుతున్నాను. మీకు నిజంగా మానవ సంబంధాలపట్ల సదభిప్రాయం వుంటే వాటి గురించి ఆర్టికల్స్ రాయమని వేడుకుంటున్నాను.

– రంజిత

ఆ ఉత్తరాన్ని చదివి "త్వరగా సిద్ధపడు. మనం ఇప్పుడు వెళ్ళి అమ్మాయినీ అల్లుడినీ మనింటికి తీసుకువద్దాం" అన్నాడు ప్రొఫెసర్ బలదేవ. ❖

*నవ్య వీక్లీ, 6-2-2013*